క్లుప్తంగా

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న గ్రామ పెద్దలు

గజపతినగరం రూరల్: గంగచోళ్లపెంట గ్రామంలో శివాలయం వార్షికోత్సవాల్లో భాగంగా యోగానందభారతి ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. శివపార్వతుల కల్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం ఆలయం వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు.

తీరు మార్చుకోకుంటే చర్యలు



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

గజపతినగరం రూరల్: విధుల్లో అలసత్వం వహిస్తున్న వైద్య సిబ్బంది తమ తీరు మార్చుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ జీవనరాణి అన్నారు. మండలంలోని మరుపల్లి గ్రామ పీహెచ్‌సీలో సోమవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి, ఆస్పత్రిలో అందిస్తున్న సేవలు, సిబ్బంది పనితీరు వైద్యాధికారులను ఆరా తీశారు. కొంతమంది సిబ్బంది తమకు నచ్చిన సమయానికి విధులకు హాజరవుతున్నట్లు తెలయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో రోగులకు సేవలు సక్రమంగా అందడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రసవాలు, ఓపీ సంఖ్య పెంచాలని వైద్యులకు సూచించారు. అనంతరం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు.

ఎమ్మెల్సీకి సన్మానం



ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడును సత్కరిస్తున్న పీఆర్టీయూ నాయకులు

శృంగవరపుకోట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన గాదె శ్రీనివాసులునాయుడు సోమవారం ఎస్.కోట వచ్చారు. స్థానిక పీఆర్టీయూ నాయకులతో కలిసి దేవీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, అర్చకుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈసందర్భంగా ఆయన్ని మండల పీఆర్టీయూ నాయకులు కె.మోహన్‌రాజ్, సీహెచ్.మధుమోహన్, అల్లు సురేష్, కె.బంగారునాయుడు, జి.సూరిబాబు, టి.అప్పారావు సన్మానించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

ఫ్రిజ్ వితరణ



ఫ్రిజ్ అందజేస్తున్న రమణ

చీపురుపల్లి: పేదింటి ఆడ పిల్లల వివాహాలకు తమ సహకారం ఉంటుందని శ్రీ దుర్గా మల్లేశ్వర సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు ముల్లు రమణ చెప్పారు. పట్టణంలోని మెట్టకాలనీకి చెందిన లుకలాపు సాధునాయుడు కుమార్తె వివాహం సందర్భంగా రూ.25 వేలు విలువైన ఫ్రిజ్‌ను కస్పావీధిలో తన నివాసం వద్ద సోమవారం అందజేశారు. ఈసందర్భంగా రమణ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ఆడ పిల్లల వివాహాలకు, పేదల ఇళ్ల నిర్మాణాలకు తమ ట్రస్టు నుంచి సహాయం అందిస్తున్నట్లు చెప్పారు.

ఉత్కంఠగా గుర్రాల పరుగు ప్రదర్శన



పోటీల్లో దౌడు తీస్తున్న గుర్రం

లక్కవరపుకోట: మండలంలోని తలారి గ్రామంలో అచ్చియ్యమ్మ పేరంటాల తీర్థం సందర్భంగా సోమవారం నిర్వహించిన అంతర్ జిల్లాల గుర్రాల పరుగు పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. పోటీల్లో మొత్తం 12 గుర్రాలు పాల్గొనగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, తలారి గ్రామానికి చెందిన గుమ్మడి సత్యనారాయణకి చెందిన శక్తి గుర్రం ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో అలమండ శ్రీనురాజుకు చెందిన కాళి గుర్రం, తృతీయ స్థానంలో తలారి గ్రామస్తుడు గుమ్మడి సత్యనారాయణకు చెందిన జెర్సీ గుర్రం నిలిచాయి. వరుస అయిదు స్థానాల్లో నిలిచిన గుర్రాలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు.

మధ్యాహ్న భోజనాల పరిశీలన

గజపతినగరం: పురిటిపెంటలోని హరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను ఎంఈఓ-2 సాయిచక్రధర్ సోమవారం పరిశీలించారు. రోజూ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు.

దగా ప్రభుత్వంపై.. యువత పోరు



కొత్తవలస: 'యువత పోరు' వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి, నాయకులు

- 12న కలెక్టరేట్ వద్ద ధర్నా
- వాల్ పోస్టర్లు విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యేలు అప్పలనరసయ్య, శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు

గజపతినగరం/చీపురుపల్లి/కొత్తవలస: యువత, నిరుద్యోగులతో పాటు అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబునాయుడు, కూటమి నాయకులు నమ్మించి మోసం చేశారని గజపతినగరం, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, కడుబండి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం మండిపడ్డారు. ఈదగా కూటమి ప్రభుత్వంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 12న 'యువత పోరు' పేరిట జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ వద్ద ధర్నాకు వైఎస్సార్‌సీపీ సిద్ధమయ్యిందని వారు తెలిపారు. గజపతినగరం, చీపురుపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయాల్లో బొత్స అప్పలనరసయ్య, ఇప్పిలి అనంతం, కొత్తవలస మండలంలోని అర్థన్నపాలెం గ్రామంలో ఉన్న తన క్యాంపు ఆఫీస్‌లో కడుబండి శ్రీనివాసరావు 'యువత పోరు' వాల్‌పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 'యువతపోరు' ధర్నాకు విద్యార్థులు, నిరుద్యోగ యువత, తల్లిదండ్రులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు.



గజపతినగరం: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య,తదితరులు



చీపురుపల్లి: వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మోసం చేయడంలో చంద్రబాబుకు సాటి లేరు

చీపురుపల్లిలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడంలో సీఎం చంద్రబాబునాయుడుకి వేరెవరూ సాటిరారన్నారు. ఎన్నికల సమయంలో ఇష్టారీతిగా హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం పరిపాటిగా మారిందన్నారు. సూపర్ సిక్స్‌తో పాటు అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను మరోసారి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలను నీరుగార్చుతున్నారని, బడ్జెట్‌లో అరకొరగా కేటాయింపులు చేశారని గుర్తు చేశారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, నిరుద్యోగ యువతకు ప్రతీనెల రూ.3 వేలు భృతి ఇస్తామని చెప్పారని, ఇప్పుడు ఆ పథకం ఊసే ఎత్తడం లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అటకెక్కించేశారని, ఉచిత గ్యాస్, అన్నదాత సుఖీభవ పథకాలకు పూర్తి స్థాయిలో కేటాయింపులు చేయలేదని వివరించారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఈ పదినెలల్లో లక్ష కోట్ల రూపాయలు అప్పు చేసిందని, కానీ ఒక్క రూపాయి కూడా సంక్షేమానికి, అభివృద్ధి కోసం ఖర్చు చేయలేదని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాలనాయుడు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, వలంటీర్ల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన త్రినాథరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ దన్నాన జనార్ధనరావు, నాయకులు అధికార్ల శ్రీనుబాబు, రఘుమండ త్రినాథ, గిరడ రాందాసు, రేవల్ల సత్తిబాబు, ఇప్పిలి గోవింద, కోరుకొండ దాలయ్య, గవిడి సురేష్, ముల్లు పైడిరాజు, మాధవ్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులపై ఎందుకీ కక్ష

గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతూ కళాశాలలకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యం విద్యార్థులను బయటకు పంపించే దుస్థితి వచ్చిందని అన్నారు. పేదింటి పిల్లలు కూడా ఉన్నత చదువులు చదువుకోవాలనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. అటువంటి గొప్ప పథకాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. 2019-24 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని పటిష్టంగా అమలు చేశారని చెప్పారు. 2014-19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి నిధులు విడుదల చేయకుండా పేదపిల్లలను ఉన్నత చదువులకు ఏ విధంగా దూరం చేశారో మళ్లీ ఇప్పుడు అదే పంథా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. పేదపిల్లలపై చంద్రబాబుకి ఎందుకింత కక్ష అని ప్రశ్నించారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసేలా దుర్మార్గపు ఆలోచన చేస్తున్నారని ఆరోపించారు. విద్యను వ్యాపారం చేసి పేద పిల్లల బతుకులను సర్వనాశనం చేసేందుకు సీఎం చంద్రబాబు కంకణం కట్టుకున్నారని, 20లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి యువతకు శఠగోపం పెట్టారని మండిపడ్డారు. గజపతినగరం జెడ్పీటీసీ గార తవుడు, తుమికాపల్లి, మధుపాడ,పాతశ్రీరంగ రాజపురం గ్రామాల సర్పంచ్‌లు బెల్లాన త్రినాథరావు, కె.పైడిపునాయుడు ,గిడిజాల కామునాయుడు, పురిటిపెంట మాజీ సర్పంచ్ మండల సురేష్, సీనియర్ నాయకులు కరణం ఆదినారాయణ, పాండ్రంకి సూర్యప్రకాష్, ఈదుబిల్లి తిరుపతిరావు, పి.నారాయణమూర్తి,కర్రి రామునాయుడు పాల్గొన్నారు.

ప్రజలను నిలువునా మోసం చేశారు..

అర్థన్నపాలెంలోని తన క్యాంపు ఆఫీస్‌లో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజులు కట్టలేని విద్యార్థులను ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు పెడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలు అంటూ ఓట్లు వేయించుకుని.. గద్దెనెక్కాక వాటిని అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశారని అన్నారు. తానెప్పుడూ పెత్తందారులు, దోపిడీ దారుల పక్షానే ఉంటానని చంద్రబాబు మరోమారు రుజువు చేశారని అన్నారు. విశాఖపట్నం లోని రుషికొండ భవనాలను మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన సొంత అవసరాలకు నిర్మించుకున్నారని కూటమి నాయకులు ఇష్టానుసారం విమర్శించారని, ఇప్పుడు ఆ భవనాల నిర్మాణ కాంట్రాక్టర్‌కు సుమారు రూ.84 కోట్లు బిల్లులను చెల్లించారని గుర్తు చేశారు. జగన్ మోహన్‌రెడ్డి సొంత భవనాలైతే మీరెందుకు బిల్లులు చెల్లించారని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే శోభాహైమావతి మాట్లాడుతూ చంద్ర బాబు... ఏదయ్యా తల్లికి వందనం పథకం అంటూ ప్రశ్నించారు. ఫీజ రీయింబర్స్‌మెంట్ కాకపోవడంతో ఎంతో మంది పేద విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు చిన్నరామునాయుడు, ఎస్.కోట జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, ఎల్.కోట,వేపాడ ఎంపీపీలు గేదెల శ్రీనివాసరావు, దొగ్గ సత్యవంతుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు ఎం.జగన్నాథం, ఒబ్బిన నాయుడు, మోపాడ కుమార్, మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, నాయకులు యడ్ల కిశోర్, బొంతల వెంకటరావు, అడపా ఈశ్వరరావు, వాకాడ సతీష్, బోకం అప్పారావు,పల్లా భీష్మ పాల్గొన్నారు.

దూడలకు బ్రూసెల్లోసిస్ టీకాలు



దూడలకు బ్రూసెల్లోసిస్ టీకాలు వేస్తున్న పశు వైద్యులు

చీపురుపల్లి: ఆడ దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి సోకకుండా నివారణ టీకాలు వేస్తున్నామని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ ఆర్. శారద తెలిపారు.స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో ఆడ దూడలకు సోమవారం టీకాలు వేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెలాఖరు వరకు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, పాడి రైతులు నాలుగు నెలల నుంచి ఎనిమిది నెలల వయస్సు గల ఆడ దూడలను తీసుకువచ్చి బ్రూసెల్లోసిస్ టీకాలు వేయించాలన్నారు. ఈటీకా జీవిత కాలంలో ఒక సారి వేస్తే సరిపోతుందని, లేకపోతే ఆడ దూడలు పెరిగి పెద్దయ్యాక గర్భధారణ సమయంలో సమస్యలు ఎదుర్కొనాల్సి ఉంటుందన్నారు. బ్రూసెల్లోసిస్ వ్యాధి పశువుల నుంచి మనుషులకు కూడా సంక్రమించే ప్రమాదం ఉందని చెప్పారు.

పని ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించండి



చీపురుపల్లి: ఇన్‌చార్జి ఎంపీడీఓ సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు



గంట్యాడ: ఎంపీడీఓ రమణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు



లక్కవరపుకోట: ఎంపీడీఓ అప్పారావుకి వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రకరకాల సర్వేలు, యాప్‌ల్లో సమాచారం అప్‌లోడ్ తదితర పనులతో రోజు రోజుకీ తమపై ఒత్తిడి పెరిగిపోతోందని, ఈ ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించాలని కోరుతూ చీపురుపల్లి, మెరకముడిదాం, ఎల్.కోట, గంట్యాడ మండలాల పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఆయా మండలాల ఎంపీడీఓలను సోమవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు పదిరకాల సర్వేలతో పాటు ఇంటి పన్ను, కుళాయి పన్ను వసూళ్లు, పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, క్లోరినేషన్, ప్రతీ మూడో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర, పంచాయతీ రికార్డుల నిర్వహణ, ఆడిటింగ్, ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాలతో తీవ్ర పని భారం పడుతోందని వాపోయారు. సెలవుల్లో సైతం పనులు చేస్తూ కుటుంబ సభ్యులకు దూరమవ్వడమే కాకుండా అనారోగ్యానికి గురికావాల్సి వస్తోందన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పని ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించాలని కోరారు. - చీపురుపల్లి/మెరకముడిదాం/లక్కవరపుకోట/గంట్యాడ

పల్లపుదుంగాడలో ఎమ్మెల్సీ పర్యటన



గిరిజనులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: మండలంలోని ధారపర్తి పంచాయతీ పరిధి గిరిశిఖర గ్రామాల్లో చిన్నారులు జ్వరాల భారిన పడి ఆస్పత్రుల్లో చేరడం, తట్టు వ్యాధి ప్రబలడంతో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పల్లపుదుంగాడ గ్రామంలో సోమవారం పర్యటించారు. గిరిజనులతో మాట్లాడి పిల్లల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. దేశంలో కనుమరుగైన తట్టు వ్యాధి ఇక్కడ కనిపిస్తుండడంపై విస్మయం వ్యక్తం చేశారు. చిన్నారులకు వేయాల్సిన వాక్సిన్‌ల విషయంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. క్షేత్రస్థాయిలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది సక్రమంగా పనిచేసేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. గిరిశిఖర గ్రామాల్లో తక్షణ వైద్య సాయం అందేలా యంత్రాంగం మందులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం, స్కూల్‌ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీటీసీ ధారగిరి, మాజీ సర్పంచ్ ఎర్రయ్య ఉన్నారు.

దారి ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్ అజూ రఫీజాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మెరకముడిదాం: ఉత్తరావల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో పొలాలకు వెళ్లే దారిని కొందరు ఆక్రమించుకున్నారని ఆ గ్రామ రైతులు తహసీల్దార్ అజూ రఫీజాన్‌కు ఫిర్యాదు చేశారు. రైతులు మాజీ సర్పంచ్ మండల సత్యనారాయణతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అజూ రఫీజాన్ ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 69-1, 63-1లలో ఉన్నస్థలంలో పొలాలకు వెళ్లేందుకు గతంలో దారి ఉండేదని, ఆస్థలాన్ని కొంతమంది ఆక్రమించేశారని వివరించారు. ఆస్థలాన్ని ఆక్రమణదారుల నుంచి విడిపించి తమ పొలాలకు రోడ్డు వేయాలని రైతులు మండల సత్యనారాయణ, మండల జగన్‌మోహన్ రావు, మండల అప్పలనాయుడు, మండల లక్ష్మునాయుడు, లోచర్ల అప్పలనాయుడు, మండల అచ్యుతరావు.మండల రమణ మండల సుబ్బినాయుడు, మండల తాతినాయుడు తదితరులు కోరారు.

12న వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

చీపురుపల్లి: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 12వ తేదీన స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నామని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12న ఉదయం 9 గంటలకు వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆ పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాలనాయుడు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, వలంటీర్లు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన త్రినాథరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ దన్నాన జనార్ధనరావు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఐదుగురి అరెస్ట్

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం ఆర్వోబీ వద్ద గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని, కొనుగోలు చేసిన ఇద్దరిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు గజపతినగరం సీఐ జీఏవీ రమణ తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం పెదమానాపురం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన్యం జిల్లా సాలూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులు పాలవలస నారాయణ, గొల్లపల్లి సాయికుమార్ మరో మైనర్ కలిసి పెదమానాపురానికి చెందిన ఎం అభిరాం మరో మైనర్‌కు గంజాయి విక్రయిస్తుండగా స్థానికుల సమాచారం మేరకు పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వారి నుంచి 4.6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సీఐ చెప్పారు.

రెండుపూరిళ్లు దగ్ధం



ఉత్తరావల్లిలో అగ్నిప్రమాద బాధితులకు బియ్యం అందజేస్తున్న తహసీల్దార్ అజూరఫీజాన్

మెరకముడిదాం: మండలంలోని ఉత్తరావల్లి గ్రామంలో సోమవారం రెండు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన గొర్లె శ్రీరాములు, చాపేనగౌరమ్మలకు చెందిన ఇళ్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయినట్లు అధికారులు నిర్ధారించారు. దీంతో ఈరెండు కుటుంబాలకు నిలువ నీడలేకుండా పోయింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక తహసీల్దార్ అజూరఫీజాన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వారికి ప్రభుత్వం నుంచి తక్షణ సహాయం కింద 10 కిలోల బియ్యం చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్ద మండల రమణ, మోహన్‌రావు పాల్గొన్నారు.

బుధరాయవలసలో వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ సింధూరి

మెరరకముడిదాం: మండలంలోని బుధరాయవలస గ్రామంలో విజయనగరానికి చెందిన శ్రీసాయి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గ్రామానికి చెందిన 85 మందికి వైద్యురాలు కె.సింధూరి వివిధ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.శిబిరం నిర్వహణకు గ్రామానికి చెందిన బాలి మహేష్ సహాయ సహకారాలు అందజేశారు.

మహిళలకు ఆదర్శం సావిత్రిబాయి పూలే



చీపురుపల్లి: ఎమ్మార్సీలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంఈఓ బూసినాయుడు



లక్కవరపుకోట: జమ్మాదేవిపేట గురుకులంలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్,ఉపాధ్యాయినులు, విద్యార్థినులు

చీపురుపల్లి: దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే మహిళాలోకానికి ఆదర్శమని ఎంఈఓ ఎం.బూసినాయుడు అన్నారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం(ఎమ్మార్సీ)లో సావిత్రిబాయి పూలే వర్ధంతిని సోమవారం నిర్వహించారు. కార్యాలయ ఆవరణలోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంఈఓ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో ఎంతో కృషి చేశారని తెలిపారు. మండల విద్యాశాఖ సిబ్బంది భాగ్యలక్ష్మి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మాదేవిపేట గురుకులంలో..

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట సమీపంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని సోమ వారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ యు.విజయ్‌కుమార్‌పాత్రో, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కొత్తవలస :తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ నీలకంఠరావు, ఉద్యోగులు

కొత్తవలసలో..

కొత్తవలస: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి తహసీల్దార్ బి.నీలకంఠరావు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ తహసీల్దార్ పప్పు హరి, మండల రెవెన్యూ అధికారి సీహెచ్. రాజేష్, వీఆర్‌ఓ రామానుజం తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్రాస్ ప్రోగ్రామ్ ప్రారంభం



చీపురుపల్లి: జెండా ఊపి క్రాస్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటనర్సమ్మ



బొండపల్లి: జెండా ఊపి క్రాస్ ప్రోగ్రామ్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ చలం నాయుడు

చీపురుపల్లి: వేసవిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా బోర్ల మరమ్మతుల కోసం సమ్మర్ క్రాస్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ చెప్పారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం సమ్మర్ క్రాస్ ప్రోగ్రామ్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో హ్యాండ్ బోర్లకు మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఐ.సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, మీసాల వరహాల నాయుడు, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, దన్నాన జనార్ధనరావు, బెల్లాన త్రినాథరావు, అధికార్ల శ్రీనుబాబు, గవిడి సురేష్, కర్రోతు ప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

బొండపల్లి: గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చల్లా చలం నాయుడు ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సమ్మర్ క్రాస్ పోగ్రామ్‌ను సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 512 హ్యాండ్ బోర్లకు రూ. 4.50 లక్షలతో మరమ్మతులు చేయించనున్నామని చెప్పారు. వచ్చే నెల 8వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.ఎంపీడీఓ జి.గిరిబాల, ఏఓ కె.తులసీ రాం, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ సునీల్ కుమార్, మండల పరిషత్ కార్యాలయ సీనియర్ సహాయకులు ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.